క్లుప్తంగా

తాడిపత్రిలో మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్



మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న వెంకటలక్ష్మి

తాడిపత్రిటౌన్: పట్టణంలో శుక్రవారం మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకురాలు గజ్జల వెంకట లక్ష్మి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటికి వెళ్లి తన కుమారుడి వివాహానికి ఆహ్వానించారు. అలాగే వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పేరం స్వర్ణలత ఇంటికి వెళ్లి.. ఆమెను పరామర్శించి, శుభకార్యానికి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న డీవీఈఓ

తాడిపత్రి టౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులు గౌసియా, నరేంద్రను డీవీఈఓ వెంకటరమణ అభినందించారు. రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 22న ముంబయిలో జరిగిన నేషనల్ కాంపిటేషన్‌లో ఏపీ తరపున పాల్గొన్న గౌసియా 4వ స్థానంలో నిలవడం, ఇంటర్ మొదటి సంవత్సరం (బైపీసీ) ఫలితాల్లో నరేంద్ర జిల్లాలో రెండో ర్యాంకు సాధించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటనారాయణ, రాజారెడ్డి, రాజేష్, శ్రీధర్‌రెడ్డి, శివశంకర్, అక్బర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

గుత్తి: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శుక్రవారం స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ విజయలక్ష్మి, సూపరింటెండెంట్ ఐజాక్ తనిఖీ చేశారు. కార్యాలయంలోని పలు రికార్డులు, రిజిస్ట్రేషన్ల ప్రక్రియలను పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా వచ్చినట్లు మీడియాకు ఆమె తెలిపారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ



బాక్సింగ్ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పుట్లూరు: స్కూల్ గేమ్స్‌లో భాగంగా రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి బాక్సింగ్, ఉషు పోటీల్లో పుట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి పతకాలను సాధించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున, ఉపాధ్యాయులు వారిని అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు ప్రత్యేక శిక్షణ వల్ల బాక్సింగ్‌లో ప్రత్యూష వెండి పతకం, భార్గవి రజత పతకం, ఉషు క్రీడలో జగన్‌మోహన్‌రెడ్డి వెండి పతకం, మణికంఠరెడ్డి రజత పతకం సాధించారని హెచ్‌ఎం తెలిపారు.

ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల 'సప్తశక్తి'

పామిడి: పట్టణంలోని నిట్టూరు నిలయం ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఆ సంఘం శతాబ్ది ఉత్సవాల సప్తశక్తి సంగమం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం సభ్యురాలు హేమ అధ్యక్షతన మహిళల కోసం ఈ కార్యక్రమం చేపట్టారు. కుటుంబ ప్రబోధన, పర్యావరణ పరిరక్షణలో గృహిణి పాత్ర వంటి పలు అంశాలపై హెచ్‌ఎం తులసిబాయి, చంద్రిక అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆచార్య బృందం, విద్యార్థులు, వారి తల్లులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రారంభం



రేణుకా ఎల్లమ్మకు పూజలు చేస్తున్న దృశ్యం

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని ఎస్‌ఎస్ పల్లిలో నూతనంగా నిర్మించిన రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. రేణుకా ఎల్లమ్మ మాన్యం భూములు సాగు చేస్తున్న ఆకుల వెంకట రమణ, కోనేరు మహేష్, ఆముదాల వెంకటేష్‌తో పాటు పలువురు చందాలు వేసి ఆలయాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఎల్లమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అలాగే హోమాలు, గణపతి హోమం, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైద్య విద్య దూరం చేసే కుట్ర

- చంద్రబాబుపై శింగనమల సమన్వయకర్త శైలజానాథ్ ధ్వజం
- యల్లనూరులో కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి స్పందన



మాట్లాడుతున్న మాజీ మంత్రి శైలజానాథ్



హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

యల్లనూరు: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో నష్టపోయేది మన పిల్లలేనని, పేదలకు ఉచిత వైద్యం, వైద్య విద్య అందకుండా కూటమి ప్రభుత్వం కుట్ర పన్నిందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ శింగనమల సమన్వయకర్త సాకే శైలజానాథ్ ధ్వజమెత్తారు. యల్లనూరు మండల కేంద్రంలో శుక్రవారం రచ్చబండలో భాగంగా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, నార్పల మండల పరిశీలకులు భోగతి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో యల్లనూరు వైఎస్సార్ విగ్రహం వద్ద బస్టాండు వద్ద నిర్వహించారు. శైలజానాథ్ మాట్లాడుతూ 17 మెడికల్ కళాశాలలను వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారన్నారు. పేదలు ఉన్నత స్థాయికి ఎదగడం సీఎం చంద్రబాబుకు గిట్టదన్నారు. అందుకే కుంటి సాకులతో పేదలను వైద్యవిద్యకు దూరం చేస్తున్నారన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పసుపులేటి పద్మావతమ్మ, జిల్లా పార్టీ కార్యదర్శి విష్ణునారాయణ, మండల కన్వీనర్ శివశంకర్, సీనియర్ నాయకులు కల్లూరు ప్రతాప్‌రెడ్డి, సూరి, ఎంపీటీసీ తిమోతి, సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, నాగరాజు, నాయకులు మల్లారెడ్డి, శ్యామల, నాయకులు సుబ్బయ్య, రామకృష్ణారెడ్డి, రామ్మోహన్, కృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, తిరుపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, కిరణ్, రామాంజులరెడ్డి, జాఫర్, రమణ, మూర్తి, చేటప్ప, నాగరంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు 'రచ్చబండ'

బుక్కరాయసముద్రం: మండలంలోని కొర్రపాడు, రోటరీపురం, రెడ్డిపల్లి, చెదుళ్ల, నీలాంపల్లి తదితర గ్రామాల్లో శనివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శైలజానాథ్ ఆదేశాల మేరకు రచ్చబండ, సంతకాల సేకరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు హాజరై కార్యక్రమాలు విజయవంతం చేయాలన్నారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడండి



తాడిపత్రిలో తహసీల్దార్ సోమశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు



గుంతకల్లులో ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టు సంఘాల నాయకులు

తాడిప్రతిటౌన్/గుంతకల్లు/శింగనమల/యల్లనూరు: పత్రికాస్వేచ్ఛను కాపాడాలని విలేకరులు, వివిధ పార్టీల నేతలు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ తప్పిదాలు, లోపాలను ఎత్తి చూపే విలేకరులపై ప్రభుత్వ పెద్దలు, పోలీసులు కక్షసాధింపు చర్యలకు పాల్పడటం పత్రికా స్వేచ్ఛకు విఘాతం కల్పించడమేనన్నారు. గత నాలుగు రోజులుగా సాక్షి కార్యాలయంలో ఎడిటర్ ధనుంజయరెడ్డి, విలేకరులకు పదేపదే నోటీసులు ఇవ్వడం, విచారణ పేరుతో ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. వెంటనే ఎడిటర్ ధనుంజయరెడ్డి, విలేకరులలపై కేసులను ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు తాడిపత్రిలో తహసీల్దార్ సోమశేఖర్‌కు వినతిపత్రం అందజేసారు. కార్యక్రమంలో సీపీఐ తాడిపత్రి పట్టణ కార్యదర్శి చిరంజీవి, సహాయ కార్యదర్శి శ్రీరాములు, నాగేంద్ర, రత్నమయ్య, శ్రీనివాసులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్దిరాజు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదినారాయణ, జర్నలిస్టులు పాల్గొన్నారు. అలాగే సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి, సాక్షి యాజమాన్యంపై అక్రమ కేసులు, కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు నిరసనగా గుంతకల్లులో పట్టణ పాత్రికేయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా సాక్షి పత్రికపై వేధింపులు ఆపాలని శింగనమలలో తహసీల్దార్ శేషారెడ్డికి జర్నలిస్టులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, నాగరాజు, మల్లికార్జున, భాస్కర్, జర్నలిస్టులు పాల్గొన్నారు. అలాగే యల్లనూరులో జర్నలిస్టులు, ప్రజాసంఘాల నాయకులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తహసీల్దారు రాముకు వినతిప్రతం అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివశంకర్, జర్నలిస్టులు పాల్గొన్నారు..



శింగనమల తహసీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు, ప్రజాసంఘాలు, వైఎస్సార్‌సీపీ నాయకులు

పట్టణాభివృద్ధిపై 'కూటమి' దృష్టి సారించాలి

గుంతకల్లు: పట్టణాభివృద్ధిపై కూటమి సర్కార్ దృష్టి సారించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మూడురోజులు సీపీఐ ఆధ్వర్యంలో పట్టణ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సామూహిక దీక్షలకు ఆమెతోపాటు వైఎస్సార్ శ్రేణులు పాల్గొని మద్దతు తెలిపారు. ఆమె మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో దాదాపు 90 శాతం అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అందుకు ఉదాహరణ మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన సమస్యగా ఉన్న ధర్మవరం ఎల్‌సీ గేట్ ఎత్తివేసి ఆర్‌యూబీ నిర్మాణానికి టెండర్లు నిర్వహించడంతోపాటు పనులకు భూమి పూజ చేశారు. దాదాపు 17 నెలలు కావస్తున్నా ఇంతవరకు ధర్మవరం ఎల్‌సీ గేట్ ఎత్తివేసి పనులపై స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అలాగే పట్టణ న్యూ డెమోక్రసీ పార్టీ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి సురేష్ సామూహిక దీక్షలకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం గుంతకల్లు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్‌బాసిద్, సీపీఐ నాయకులు గోవిందు, మహేష్, గోపీనాథ్, గౌస్, రాము, ఈశ్వరయ్య పాల్గొన్నారు.



సామూహిక దీక్షలో మాట్లాడుతున్న నైరుతిరెడ్డి

శుభకార్యం

పామిడి: మండలంలోని కత్రిమల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పెమ్మక శివరామిరెడ్డి కుమారుడు పెళ్లి కార్యక్రమానికి ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు వై.నైరుతిరెడ్డి హాజరయ్యారు. వధూవరులైన పెమ్మక సంతోష్‌రెడ్డి, కవితారెడ్డిని ఆశీర్వదించారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ ప్రధాన కార్యదర్శి పెమ్మక చెన్నకేశవరెడ్డి, పట్టణ, రూరల్ కన్వీనర్లు నాగూరు ఈశ్వర్‌రెడ్డి, రమావత్ రామకృష్ణనాయక్, నారాయణరెడ్డి, దామోదర్‌రెడ్డి, రామచంద్రయ్య, ముత్యాల్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, అనుంపల్లి శివ, పుంజా నాగేష్ యాదవ్, శివాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మండల సమాఖ్య మహాసభ

పుట్లూరు: మండలకేంద్రంలో శుక్రవారం ప్రియదర్శిని మండల సమాఖ్య వార్షిక మహాసభను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీడీఓ అలివేలమ్మ, ఏరియా కోఆర్డినేటర్ వీరాస్వామి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం ప్రియదర్శిని మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని గ్రామ సంఘాల ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలిగా నల్లమ్మ, ఉపాధ్యక్షురాలిగా శివమ్మ, కార్యదర్శిగా శివలక్ష్మి, ఉప కార్యదర్శిగా క్రిష్టవేణి, కోశాధికారి మల్లేశ్వరిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటరామిరెడ్డి, సీసీలు, సభ్యులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గంతో మహిళా సంఘాల నాయకులు, అధికారులు

21 నుంచి రిలే నిరాహార దీక్షలు

గుంతకల్లుటౌన్: పట్టణంలో కార్పొరేట్ సెలూన్ షాపులను తొలగించాలని ఈ నెల 21 నుంచి మున్సిపల్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు క్షౌ రవృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ బి.శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కార్పొరేట్ సెలూన్ షాపులను తొలగించాలని గత 45 రోజులుగా నాయీ బ్రాహ్మణులు ఆందోళన చేపడుతున్నా పాలకులు, అధికారుల్లో చలనం లేదన్నారు. రిలే నిరాహారదీక్షలకు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు మద్దతు ఇవ్వాలని వారు కోరారు. కార్యక్రమంలో సంఘం పట్టణ కార్యదర్శి సూరి, నాయకులు సాయి, శివ, మురళి, శంకర్, నవీన్, అంజి, రమేష్, సురేంద్ర, చంద్ర పాల్గొన్నారు.

అద్దెలు సకాలంలో చెల్లించాలి

గుంతకల్లుటౌన్: మున్సిపల్ షాపు రూముల అద్దెలను ఎప్పటికప్పుడు చెల్లించాలని, లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పాతబస్టాండ్ ఏరియాలో బకాయిల వసూళ్ల కోసం కమిషనర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పలువురు లీజుదారుల నుంచి పన్ను బకాయిలను వసూలు చేశారు. అత్యధికంగా బకాయిలు ఉన్న రెండు షాపులకు తాళాలు వేశారు. కార్యక్రమంలో ఆర్ఐలు ఎర్రిస్వామి, సి.కె.రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

జేబు దొంగ చేతివాటం

గుంతకల్లు: స్థానిక శుభప్రదమ్ షాపింగ్ మాల్ రద్దీని ఆసరాగా చేసుకున్న ఓ దొంగ తన చేతివాటాన్ని ప్రదర్శించాడు. ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేసిన కూలీలకు డబ్బు చెల్లించేందుకు శుభప్రదమ్ షాపింగ్ మాల్ పార్టనర్ ఓంకార్ రూ.లక్షను జేబులో ఉంచుకున్నారు. ప్రారంభోత్సవానికి వచ్చిన సినీతారలను చూసేందుకు జనం ఒక్కసారిగా మాల్‌లోకి వచ్చేయడంతో రద్దీ నెలకొంది. ఆ సమయంలో ఓంకార్ జేబులోని రూ.లక్షను దుండగుడు అపహరించాడు. ఆలస్యంగా విషయాన్ని గుర్తించిన ఓంకార్ వెంటనే విషయాన్ని అక్కడే ఉన్న సీఐ మనోహర్ దృష్టికి తీసుకెళ్లారు.

హోరాహోరీగా స్కూల్ గేమ్స్ పోటీలు



గెలుపొందిన విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయులు

పుట్లూరు: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం మండల స్థాయి అండర్-17 స్కూల్ గేమ్స్‌లో భాగంగా వాలీబాల్, చెస్, యోగా పోటీలు నిర్వహించారు. పోటీలను హెచ్‌ఎం మల్లికార్జునయాదవ్ ప్రారంభించగా అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలు డివిజన్ స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ చూపాలని హెచ్‌ఎం సూచించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, గంగరాజు, శివజ్యోతి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

గుంతకల్లుటౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్ రెడ్డిని సీఐటీయూ నాయకులు కోరారు. శుక్రవారం సూపరింటెండెంట్‌ను సీఐటీయూ పట్టణ కార్యదర్శి నాగరాజు, సుజాత, రాజు, రాము తదితరులు కలసి వినతిపత్రం అందజేశారు. ఆస్పత్రిలో రోజు రోజుకూ ఔట్, ఇన్ పేషెంట్ల సంఖ్య పెరుగుతోందని, అయితే కార్మికుల సంఖ్య పెంచని కారణంగా వారిపై పనిభారం అధికమైందన్నారు. కార్మికుల సంఖ్యను కూడా పెంచాలని వారు కోరారు.

రైతుపై అటెండర్ దురుసు ప్రవర్తన

తాడిపత్రి రూరల్: మిగులు భూమిని ఆన్‌లైన్‌లోకి ఎక్కించుకునేందుకు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన రైతు శివారెడ్డిపై అటెండర్ పుల్లయ్య దురుసుగా ప్రవర్తించాడు. బలవంతంగా తహసీల్దార్ వద్ద నుంచి బయటకు తోసుకుంటూ రావడం అక్కడి వారిని నివ్వెరపరిచింది. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని బందార్లపల్లికి చెందిన రైతు శివారెడ్డికి 2.15 ఎకరాల భూమి ఉండగా అందులో 1.25 ఎకరాలు పెండేకల్లు ప్రాజెక్టు కింద కాలువల భూ సేకరణకు వెళ్లింది. మిగిలిన భూమిని కొంత కాలం క్రితం రూ.12 లక్షలకు పైగా విక్రయించాడు. ఆన్‌లైన్‌లో భూమిని ఎక్కించిన తరువాత, డబ్బు ఇస్తానని కొన్నవారు చెప్పడంతో రెండు నెలలకు పైగా అన్‌లైన్‌లో ఎక్కించాలని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. డబ్బు వస్తుందన్న ధీమాతో కూతురును విజయవాడలోని ఓ కార్పొరేట్ కళాశాలలో ఇంటర్‌లో చేర్పించాడు. ఫీజు చెల్లించాలని కళాశాల యాజమాన్యం నుంచి ఫోన్ల మీద ఫోన్లు వస్తున్నాయి. దిక్కుతోచని స్థితిలో తహసీల్దార్ సోమశేఖర్‌ను కలసి సమస్యను విన్నవించాడు. ఈ క్రమంలో తలుపు వద్ద ఉన్న అటెండర్ పుల్లయ్య సరాసరి రైతు వద్దకు వచ్చి బయటకు తోసుకువెళ్లేందుకు ప్రయత్నించాడు. బయటకు రాకుండా తహసీల్దార్‌తో మాట్లాడే ప్రయత్నం చేస్తుండగా 'నీవు కడుపుకు అన్నం తింటున్నావా? లేక గడ్డి తింటున్నావా?, బయటకు వెళ్లమంటే వెళ్లవా' అంటూ చిందులు వేశాడు. అటెండర్ మాటలతో రైతు శివారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశాడు. తాను తహసీల్దార్‌తో సమస్య చెప్పుకుంటున్నాను కదా.. నీకేం ఇబ్బంది అంటూ అటెండర్‌పై మండిపడ్డాడు. ఈ క్రమంలో వారు వాగ్వాదం చేసుకోవడంతో కార్యాలయానికి వచ్చిన వారు గుంపు కూడారు. ఈ సంఘటన అక్కడి వారిని ఆశ్చర్యానికి గురిచేసింది. అటెండర్ ప్రవర్తించిన తీరును తప్పు పడుతూ రైతును శాంతపరచడం కనిపించింది.



రైతుతో వాగ్వాదం చేస్తున్న అటెండర్

నిందితున్ని అరెస్టు చేయాలి

గుంతకల్లు రూరల్/తాడిపత్రి రూరల్/యాడికి/పెద్దవడుగూరు/గుత్తిరూరల్/పామిడి: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం గుంతకల్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఎమ్మార్పీఎస్ గౌరవాధ్యక్షుడు నరసింహులు, మండల అధ్యక్షుడు రాజు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రామాంజనేయులు, మండల మాజీ అధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ ఈ నెల 7న వాదనలు వింటున్న సమయంలో.. లాయర్ రాకేష్ కిషోర్ తన షూను జడ్జిపైకి విసిరి దాడికి పాల్పడ్డారన్నారు. అతడిపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు శ్రీనివాసులు, జయరాం, శివకుమార్, మంజునాథ్, రమేష్, జక్కన్న పాల్గొన్నారు. అలాగే తాడిపత్రి తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసనలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రాజేష్, ఎంఎస్‌పీ అధ్యక్షుడు పవన్‌కుమార్, నాయకులు పెద్దిరాజు, అమర్‌నాథ్ పాల్గొన్నారు. యాడికిలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బాబు, నాయకులు శ్రీనివాసులు, జానకిరాముడు, చిరంజీవి, నల్లప్ప, విజయ్, సాగర్, నరసింహులు, సూర్యుడు, గాంధీ, కుళ్లాయప్ప, రామాంజనేయులు, వెంకటేస్, డప్పు కళాకారులు ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా పెద్దవడుగూరులో నిర్వహించిన నిరసనలో ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్దిరాజు, రంగస్వామి, పెద్దులయ్య, మారయ్య, లాలెప్ప, నారాయణ, అనిల్, కుమార్, బొలికొండ, నారా రంగస్వామి, రాముడు పాల్గొన్నారు. అలాగే గుత్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దిలేటి, నగేష్, ఈరన్న, చలపతి నిరసన తెలిపారు.అలాగే పామిడిలో చేపట్టిన నిరసనలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు లాలెప్ప తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

పామిడి: పట్టణంలోని ఏపీ ఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట సీపీఎం అనుబంధం సంఘం సీఐటీయూ, విద్యుత్ ట్రేడ్ యూనియన్ల స్ట్రగుల్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వారు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు, పీ అనిమిరెడ్డి, మల్లేసు, ముత్యాలు, పీట్ల వడ్డే శివకుమార్, విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ కార్మికులు తిరుపాల్‌నాయక్, నాగేంద్రప్రసాద్, ఇబ్రహీం, నరసింగ, నాగరాజు, షెక్షా, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

అండర్-17 వాలీబాల్ బాల, బాలికల జట్ల ఎంపిక



బాలికల జట్టు



బాలుర జట్టు

గుంతకల్లు: పట్టణంలోని సత్యనారాయణపేటలో ఉన్న ఎస్‌ఆర్‌కే మున్సిపల్ బాయ్స్ హైస్కూల్‌లో శుక్రవారం మండల స్థాయి అండర్-17 బాల బాలికల జట్లను ఎంపిక చేసినట్లు మండల ఎస్‌జీఎఫ్ కోర్డినేటర్ పీ.సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓలు మస్తానయ్య, సుబ్బరాయుడులు హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసులు హాజరయ్యారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలని వారు ఆకాంక్షించారు.

అండర్-17 బాలురు జట్టు..

అండర్ -17 బాలుర జట్టులో ఆర్.కిరణ్‌కుమార్, సతీష్, సమీద్దన్ గుంతకల్లు, ఎస్‌జేపీ హైస్కూల్ , చరణ్ సాయి తేజ్, హరి, సుధనంద (పాతకొత్తచెరువు హైస్కూల్), విష్ణువర్ధన్ (నాగసముద్రం), శ్రీకాంత్ (ఎస్‌ఆర్‌కే, గుంతకల్లు), అరవింద్ (కసాపురం) భారత్ (నెలగొండ), సాయి (తిమ్మాపురం) సుకాంత్ (నెలగొండ). సబ్‌ట్యూట్ ప్లేయర్‌లు హరీష్‌నాయక్ (విజ్ఞాన్, గుంతకల్లు), సచిన్, జాఫర్(ఎస్‌జేపీజీహెచ్‌ఎస్ హైస్కూల్).

అండర్-17 బాలికల జట్టు..

ఆసీఫా, మోఘమాల, అర్చన, హఫ్రీన్ (గుంతకల్లు కేజీబీవీ), (అశ్విని, సరస్వతి, వైశాలి (ఎస్ఎస్ఎంజీహెచ్ మున్సిపల్ హైస్కూల్) అంబిక, కీర్తి, సుమంజలి (పాతకొత్తచెరువు హైస్కూల్). రబీయా (విజ్ఞాన్, గుంతకల్లు),రతిక (నెలగొండ), సబ్‌ట్యూట్ ప్లేయర్‌లుగా శ్రావణి (ఎస్ఎస్ఎంజీహెచ్, గుంతకల్లు), అయిషా, సునీత (కేజీబీవీ).

సంక్షిప్త సమాచారం

హంద్రీ-నీవా కాలువకు మరమ్మతు

గుంతకల్లు రూరల్: హంద్రీ-నీవా నీటి ప్రవాహం పెరగడంతో.. గుంతకల్లు మండలంలోని జీ.కొట్టాల వద్ద కాలువ నిండి నీటి ప్రవాహం బయటకు వచ్చే పరిస్థితి ఏర్పడటంతో శుక్రవారం ఆ ప్రాంతంలో మరమ్మతులు చేపట్టారు. రాగులపాడు లిఫ్ట్ వద్ద నాలుగు మోటర్ల పంపింగ్ నిలిచిపోవడంతో కాలువలో అమాంతం నీటి ప్రవాహం పెరిగిపోయింది. దీంతో జీ.కొట్టాల వద్ద నీటి ప్రవాహం అంతకంతకూ పెరిగి ఒక చోట నీరు బయటకు వెళ్లడం ప్రారంభించింది. పరిస్థితిని గమనించిన స్థానికులు గండి పడే ప్రమాదం పొంచి ఉందని వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ రాఘవేంద్రప్ప, కసాపురం ఎస్ఐ టీపీ వెంకటస్వామి, హంద్రీ-నీవా ఏఈ చలపతి వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సాయంతో మట్టిని ఏర్పాటు చేసి మరమ్మతులు చేపట్టారు.

ఆటో నుంచి జారి పడి వ్యక్తికి గాయాలు

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని పత్తికొండ రోడ్డులో ఉన్న ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై శుక్రవారం ప్రమాదం చోటు చేసుకుని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. జొన్నగిరికి చెందిన శ్రీకాంత్ పని మీద గుత్తికి వచ్చాడు. తిరిగి ఆటోలో ఊరికి వెళుతుండగా మార్గమధ్యలో ఆటోలో నుంచి జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

శింగనమల: మండలంలోని వంకల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను శుక్రవారం తెల్లవారుజామున శింగనమల పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్ల యజమానుల నుంచి అపరాధ రుసుం వసూలు చేశారు. మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

ఈ-కేవైసీ గడువు పొడిగించండి

యల్లనూరు: ఉపాధి కూలీలకు ప్రభుత్వం చేపట్టిన ఐరీష్, ఈ-కేవైసీ ప్రక్రియ గడువును పొడిగించాలని మండల కన్వీనర్ శివశంకర్ శుక్రవారం ఎంపీడీఓ కరుణసాగర్‌ను కలిసి విన్నవించారు. ప్రభుత్వం, జిల్లా అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి ఆదివారంతో ముగియనున్న గడువును నెల రోజులు పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక కేటాయించండి

శింగనమల (నార్పల): నార్పలలో క్రైస్తవులకు శ్మశాన వాటిక మంజూరు చేయాలని తహసీల్దార్‌కు పాస్టర్లు వినతపత్రం అందజేశారు. క్రైస్తవులు ఎవరు మృతి చెందినా.. హిందూ శ్మశాన వాటికలో దహన సంస్కారాలు చేస్తున్నామన్నారు. అధికారులు స్పందించి క్రైస్తవులకు శ్మశాన వాటిక మంజూరు చేయాలని వారు కోరారు. పాస్టర్లు సదానందనం, డేవిడ్, పాల్ జాన్ , ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

పెద్దవడుగూరు: బాలలపై దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని, బాల్య వివాహాలు జరుగకుండా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి సూచించారు. శుక్రవారం మండలంలోని క్రిష్టిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మాస దినోత్సవం నిర్వహించారు.